'కానీ జీవితం వ్యాపారం కాదు.'

'జీవితం వ్యాపారం కాకపోయినా వ్యాపారం జీవితంలో ఓ భాగమని మీరు అంగీకరిస్తారనుకుంటాను.'

'అలా అని ఇంత బ్రతుకూ బ్రతికిన నేను నా కూతుర్ని అయిదు లక్షలకు అమ్ముకోలేను.'

'ఇందులో అమ్మడమనే ప్రసక్తిలేదు రంగనాధంగారూ! జస్ట్ బార్డర్ సిస్టమ్.... ఇచ్చిపుచ్చుకోవటం.....'

రంగనాధంగారు మౌనంగా ఉండిపోయారు.

'అయినా రేపు మీ పరిస్థితి అస్తవ్యస్థమయితే మీ అమ్మాయికి పెళ్ళిమాటైనా తలపెట్టగలరా? ఎండ కన్నెరుగకుండా పెరిగిన శిల్ప అలాంటి పరిస్థితుల్ని తట్టుకొని నిలబడగలదా అన్న ప్రశ్నలు మీలో తలెత్తితే నా ప్రపోజల్ మీరు అపార్ధం చేసుకునేవారు కాదు' కిరీటి మాటలు రంగనాధంగారిలో కొంత ఆలోచనలని రేకెత్తించాయి.

'అదీ గాకుండా ముక్కుసూటిగా అడిగానన్న నేరం తప్ప నేనెందులో తక్కువవాడ్ని... అందం లేదా.... చదువు లేదా..... ఆస్తిలేదా....ఇన్ వాట్ వే ఐయామ్ ఇన్ ఫియర్ టు యువర్ డాటర్.'

కిరీటి మాటల్లోని నిజాయితీ రంగనాధంగార్ని పూర్తిగా ఆకట్టుకుంది.

నిజమే..... శిల్ప అంగీకరిస్తే నిజంగా కిరీటి అన్ని విధాలా అర్హుడే.

'వెల్....మీ అంగీకరాన్ని రేపటిలోగా నాకు తెలియజేయండి. ఇందులో బలవంతం ఏమీ లేదు.'

రంగనాధంగారు పైకి లేచారు.

'మరొక్కమాట మీ అంగీకరాన్ని రేపు నాకు ఫోన్ ద్వారా తెలియచేస్తే స్వయంగా నేను వస్తాను... పెళ్ళిచూపులనే ఫార్మాలిటిస్‌తో కాకపోయినా శిల్పతో పర్సనల్‌గా మాట్లాడాలని.'

యాంత్రికంగా ఇంటికి తిరిగి వచ్చిన రంగనాధంగారిలో ఊహించని ఈ సంఘటన పెద్ద సంచలనమే రేకెత్తించింది.

ఎవరీ కిరీటి..... ఇంతవరకూ తనకు పరిచయంలేని యీ వ్యక్తికి శిల్ప ఎలా తెలుసు.... శిల్పపై అంతటి మక్కువ ఏర్పటటానికి కారణం ఏమిటి?

అసలు యీ విషయం శిల్పకెలా తెలియపరచటం..... అతడివ్వబోయే డబ్బుకి తను నిలుపు కోవాలను కుంటున్న పరువుకే మధ్య అనుసంధానంలా నిలిచే ఈ సంబంధాన్ని శిల్ప హర్షిస్తుందా?

సాయంకాలం వరకూ సందిగ్ధంలో ఉండిపోయారాయన.

ఆ రాత్రి భోజనాలయ్యాక శిల్పను డాబాపైకి తీసుకు వెళ్ళారు.

అన్ని విషయాలనూ తెలియపరిచారు.

అంతావిన్న శిల్పనుండి ఏ జవాబు రాకపోయేసరికి ఆయనలో ధైర్యం సడలిపోయింది.

'ఇంత జరిగినా నిజానికి నేను అవునని గాని కాదని గాని ఏమి కమిట్ అవలేదమ్మా... కారణం ఇది నీ జీవిత సమస్యని నిన్ను సంప్రదించకుండా ఏ నిర్ణయానికి రాకూడదని ...' సంజాయిషీ ఇస్తున్నట్టుగా అర్థోక్తిలో ఆగిపోయారాయన.

డబ్బు అప్పిచ్చి వ్యవహారాన్ని కోర్టూ వారకూ లాగి విషమ పరిస్థితుల్ని సృష్టించి ఇప్పుడు ఆదుకుంటానని హామీ ఇవ్వడం కిరీటి తనకోసం పన్నిన ఓ వలలా అనిపించింది.

తనను సమిధను చేయాలనే ఉద్దేశ్యంతో రగిల్చిన హోమంలా కనిపించింది ప్రతీకారవాంఛతో ఆమె మనసు అట్టుడికి పోయింది.

ఎవడైనా కానీ... ఆ కిరీటికో గుణపాఠం చెప్పాలి... డబ్బుతో పాముని కొనుక్కోగలడు కాని ఆ పడగ నీడన నిశ్చితంగా నిద్రపోలేడని నిరూపించాలి.

'ఒప్పుకుంటున్నాను నాన్నగారూ!'

గుండెల్ని దగ్ధం చేస్తున్న దావానలాన్ని ముఖంపై మెరియకుండా జాగ్రత్తపడింది.

'కాని యీ యింటి పరువు కోసం నిలుచున్నపాటున నువ్విలా ఓ నిర్ణయానికి రావటం న్యాయంకాదమ్మా...' నొచ్చుకుంటున్నట్టుగా అన్నారు.

'పాపం ఆయన చాలా ఔదార్యంతో మనకీ అవకాశమిచ్చారు నాన్నా! అలస్యం చేస్తే మనకు మిగిలేది అపఖ్యాతి మాత్రమే' మరోమాటకు అవకాశమివ్వకుండా ఆమె క్రిందికి వెళ్ళి పోయింది. ఎంతో రాద్ధాంతం చేస్తుందనుకున్న శిల్ప అతిసునాయాసంగా అంగీకారాన్ని తెలిపేసరికి గుండెలపై నుంచి పెద్ద బరువు దింపినట్టయింది రంగనాథంగారికి...

4

శిల్ప అంగీకారంతో ఇటు తన ఆస్తిని కాపాడుకోవటం, అటు అర్హుడైన వ్యక్తితో ఆమె పెళ్ళికూడా జరగటం లాంటి రెండు సమస్యలకు పరిష్కారం దొరికినట్టయింది రంగనాథంగారికి.

అందుకే ఆ రాత్రే ఫోను ద్వారా వైజాగ్ తెలియ పరచారు.

మరుసటి రోజు ఉదయమే త్వరగా నిద్రలేచి ఏసమయంలోనైనా కిరీటి అక్కడకు రావచ్చునని, కాస్త అందంగా అలంకరించుకోమని శిల్పకు చెప్పగానే నిర్లక్ష్యంగా ఆమె చూపిన చూపు ఆయనలో భయాన్ని రేపింది. చేజేతులా ఆ సంబంధాన్ని ఎక్కడ చెడగొడుతుందోనని.

కిరీటి వచ్చేవరకు ఆయన మనసు మనసులో లేదు. బితుకు బితుకుమంటూనే మధ్యాహ్నం వరకూ గడిపారు. మధ్యలో ఒకటి రెండుసార్లు కూతురి గదిలోకి వెళ్ళి చూశారు ఆమె అలంకరణలో ఏ మార్పు లేకపోవటంతోమరోమారు చెప్పటానికి ధైర్యం లేకపోయింది.

ఒంటి గంట ప్రాంతంలో లోగిలికి వచ్చిన కిరీటిని ఘనంగా రిసీవ్ చేసుకున్నారు రంగనాథంగారు.

ఒంటరిగా వచ్చిన కిరీటి హాలునంతా కలియచూస్తూ ఓ సోఫాలో కూర్చున్నాడు. భోజనం చేసే వచ్చానని కిరీటి చెప్పడంతో మరోమారు రెట్టించలేకపోయారు రంగనాథంగారు.

కిరీటి ఎందుకు వచ్చింది ఆయనకు తెలుసు కాబట్టి ధైర్యాన్ని కూడకట్టుకుని కూతురి గదిలోకి వెళ్ళారు.

అతి సామాన్య మైన నైలెక్స్ చీరలో పెద్దగా అలంకరించుకోకుండా కనిపించిన శిల్ప పై చెప్పలేనంత కోపం వచ్చింది. అయినా తమాయించుకున్నారు.

'ఆయనక్కావలసింది నేను కానీ నా అలంకరణ కాదు నాన్నా!' అంటూ అతి సునాయాసంగాతండ్రి మనో భావాన్ని చదివి నిర్లిప్తంగా బయటికి నడచింది.

కిరీటి కూర్చున్న హాలులోకి నడిచిన శిల్ప అతని ఉనికిని గుర్తించనంత నిర్లక్ష్యంతో అతనికెదురుగా సోఫాలో ఆసీను రాలైంది.

నవ్వుతున్న అతని పెదవులని సమ్మోహనంగా విచ్చుకున్న అతని నేత్రాన్ని చూచి తత్తరపాటుతో తల వంచుకుంది.

ఎవరీ కిరీటి... ఎక్కడో చూసినట్టుందే.... ఆ చూపులు ఆ చిలిపి నవ్వు... ఎక్కడ.. ఎక్కడ చూసింది తను.

ఎంత ప్రయత్నించినా గుర్తు రాలేదు.

ఎవరైనా కానీ అతను తన శత్రువు.

తన యిష్టాయిష్టాలతో పని లేకుండా తనకు ఖరీదు కట్టి కొనుక్కోవాలని ప్రయత్నిస్తున్న అహంకారి. తమ దుస్థితిపై స్వారీ చేయాలని సంకల్పించిన ఓ అవకాశవాది.

మనసు అగ్ని గోళంలా మండుతుంటే నెమ్మదిగా తల పైకెత్తి చూసింది.

క్రీం కలర్ సూట్‌లో కాలు మీద కాలు వేసుకొని కూర్చున్న కిరీటిలో ప్రపంచంలో దేన్నయినా కొనేశక్తి గలవాడినన్న అతిశయం కనిపించిందామెకు.

మిష్టర్ కిరీటి..... మానాభిమానాలున్న ఏ ఆడపిల్ల క్షమించని రీతిలో నన్ను కైవసం చేసుకోవాలని వలపన్నావు. ఈ క్షణానికి గెలుపు నీది కావచ్చునేమో కానీ గొప్ప గుణపాఠం చెప్పాలని, రేపటి నీ బ్రతుకు నవ్వులపాలు చేయాలని సంకల్పించిన నన్ను నీ దారిలోకి మళ్ళించుకో గలవా...

రాజానరేంద్రదేవ్ మనవరాలైన నన్ను ఇంత తక్కువగా అంచనా వేసిన నువ్వు ప్రతిక్షణం పశ్చాత్తప పడేటట్టు చేయని నాడు...

'మిస్ శిల్పా! మీతో పర్సనల్ గా మాట్లాడాలనుంది. అలా బయటకు వెళదాం వస్తారా ?'

కిరీటి అడగటంతో ఆలోచనలన్ని ప్రక్కకు నెట్టి సూటిగా అతని వేపే చూసింది.

ఏదో నిర్ణయించుకున్నదానిలా 'సరే' అన్నట్టుగా లేచింది.

కిరీటి డ్రైవింగ్ సీటులో కూర్చొని సైడ్‌డోర్ తెరవగానే నిస్సంకోచంగా అతడి ప్రక్కనే కూర్చుంది.

మరికొన్ని నిమిషాలలో కారు తుంపాల వీధులగుండా పరుగు తీసింది.

ఆ రోడ్లన్ని పరిచయమున్నట్లుగా అతడు కారు నడుపుతుంటే ఆమె విస్తుపోతోంది.

'కారు కాస్త కంజస్టడ్‌గా ఉందనుకుంటాను.'

అతడు టోయాటోని ఉద్ధేశించి అన్నాడు.

'ఫర్వాలేదు .... ఇద్దరికి సరిపోతుంది.'

మాటలాడటం తప్పనిసరి అన్నట్టుగా ముక్తసరిగా సమాధానమిచ్చింది.

'అఫ్‌కోర్స్.... ప్రస్తుతానికి ఇద్దరం కాబట్టి ఫర్వాలేదనుకోండి.'

అతడి మాటల్లోని గూఢార్థాన్ని గ్రహించిన శిల్ప తీక్షణంగా అతనివేపు చూసింది.

తన వ్యక్తిత్వానికి సరిపడని పరిహాసం ఆమె హర్షించదు. అందుకే నాలుగు దులిపేయాలనిపించిన ఆలోచనను బలవంతంగా అదుపులోకి తెచ్చుకుంది.

కారు మరో మలుపు తిరుగుతుంటే 'ఇటెక్కడికి' అంది అనాలోచితంగా.

'బొజ్జన్నకొండ దగ్గరికి.'

'అంటే ఈ ప్రాంతం మీకు బాగా పరిచయమన్న మాట.' జవాబుగా ఓ చిరునవ్వు నవ్వాడు.

'మీకు సింప్లిసిటీ అంటే ఇష్టమనుకుంటాను.'

అతడు దేన్ని ఉద్దేశించి ఆ మాటన్నాడో ఆమెకు అర్థంకాలేదు.

'ఐ టూ లైక్ సింప్లిసిటీ... కాబట్టే ఈ చీరలో మీరు చాలా అందంగా అనిపిస్తున్నారు.'

అందంగా అలంకరించుకొని అతని ముందుకు రావటం ఇష్టం లేక ఓ సాదా చీర కట్టుకుంటే తన ఆలోచనకి మరో కొత్త భాష్యం చెబుతున్న అతడి మాటలు విని తన ప్రయత్నం బూడిదలో పోసిన పన్నీ రైందనుకుంది.

'నేను మిమ్మల్ని ఇక్కడికెందుకు తీసుకొచ్చానో ఇప్పటికైనా గ్రహించారనుకుంటాను.'

ఆమె ముఖంలో ఎటువంటి భావమూ కనిపించకుండా జాగ్రత్త పడింది.

'శాంతి సందేశాలతో సర్వ మానవాళిని జాగృతంచేసిన ఈ బుద్ధుడి ఆరామ ప్రాంగణంలో అయితే మీరు జీవహింసకు పాల్పడరని...' అంటూ మెట్లపాయ కూర్చున్నాడు.

'జీవహింసా!'

అర్థంకానట్టుగా అతడి వేపు చూసింది.

'అవును... నన్ను అదే ఈ జీవుడ్ని మాటలతో హింసించటం జీవహింసేగా.'

'అహంకారి, అందగాడేకాదు..... మాటకారి కూడా' అనుకుంది.

మౌనంగా ముందుకు నడిచి ఓ చెట్టు నీడన చేరి నిలబడింది.

'మీరు నాకు చాలా దూరంగా వెళ్ళి పోయారు.'మృదువుగా అంటూ మెట్లపై నుండి లేచాడు.

'ముందు ముందు మరింత దూరంగా ఉంటాను' మనసులోనే అనుకుంది స్వాతిశయంతో.

'మిస్ శిల్పా... నిజానికి నేను మిమ్మల్ని ఇక్కడకు తీసుకొచ్చింది......'

'నాకు బాగా తెలుసు మిష్టర్ కిరీటి!'

ఆమెకంఠంలోని తీవ్రతకు అప్రతిభుడయ్యాడు.

'యస్ మిష్టర్ కిరీటి! మీరు నన్నిక్కడకు తీసుకు వచ్చింది మీరెంత పెట్టుబడితో నన్ను కొనుక్కుంటున్నారో చెప్పి మీ ఔదార్యాన్ని చాటుకోవటానికి అని నేనూహించగలను.'

'యూ ఆర్ మిస్టేకెన్ శిల్పా....'

'నో... నాటేటాల్ మిష్టర్ కిరీటి! ఐనో ది ప్లాన్ బిహైండ్ దిస్. మీకో అందమైన భార్య కావాలి... గొప్పింటి అమ్మాయి కావాలి. అదృష్టవశాత్తూ మీకు అవకాశం వచ్చింది. కాబట్టే నా యిష్టాయిష్టాలతో పని లేకుండానే బేరం సెటిల్ చేసుకున్నారు. నాకూ ఒక మనసుంటుందని ఆ మనసుకు కొన్ని అభిరుచులుంటాయన్న విషయాన్ని మరిచి మీ బిజినెస్ బ్రెయిన్‌తో మానాన్నగార్ని బుట్టలో వేసుకున్నారు.'

'నేను కావాలనుకుంటే మీకంటే అందగత్తెలు, గొప్పింటి అమ్మాయిలు చాలామంది వస్తారు...'

'వచ్చినా ఇలాంటి పరిస్థితుల్లో మీచేత కొనబడే అవకాశంలేదు. జీవితాంతం మీ దగ్గర అణిగి మణిగి ఉండే అవకాశం రాదు. అదేకదా మీ ఆలోచన.'

'నో...'

'యస్ మిష్టర్ కిరీటి! సరిగ్గా మీ ఆలోచన అదే. అందుకే అందర్ని వదిలి నన్ను బలి పశువుగా ఎన్ను కున్నావు.'

పెదవుల్ని బిగించి క్రోధంగా నవ్వాడు.

'ఎందుకా నవ్వు...'

'మీతెలివి తక్కువ తనానికి .... అర్థంలేని అహంకారానికి పగలబడి ఇంకా నవ్వాలనిపిస్తోంది.'

'నవ్వండి. అవసరం మాది, అవకాశం మీది.'

'రాజానరేంద్రదేవ్ మనువరాలైన శిల్పాదేవి హఠాత్తుగా ఇంత బేలగా మారటం నన్నెంతో బాధిస్తోంది.'

'నాకేవరి సానుభూతి అక్కర్లేదు.'

'అక్ఖర్లేక పోతే అయిదు లక్షలు ఎలా వస్తాయి. పరువు ప్రతిష్టలెలా నిలుస్తాయి.'

ఎగతాళిగా మాట్లాడేసరికి శిల్ప కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి.

'డోంట్ వర్రీ మిస్ శిల్పా! మిమ్మల్ని నేను తప్పకుండా ఆదుకుంటాను.'

‘ఆయాచితంగా మీరంత సర్దుబాటు చేయనక్కరలేదు మిష్టర్ కిరీటి! మీరిచ్చే డబ్బుకు బదులుగా నేను మీ కోర్కెను మన్నిస్తాను.’

ఆమె కంఠంలోనూ అవహేళన ధ్వనించింది.

‘వెల్... ఇక మీరు మాట్లాడేదేమి లేదనుకుంటాను.’ భుజాలు కుదుపుతూ అన్నాడు కిరీటి.

‘బోలెడంత జీవితం ముందుంది. తొందరెందుకు లేండి.‘

దురుసుగా కారెక్కి కూర్చుంది.

‘బెటర్ టు హావ్ ఏ సేకండ్ థాట్.‘

కారు నడుపుతూ సీరియస్‌గా అడిగాడు.

‘తీసుకున్న నిర్ణయాల నుండి ప్రక్కకు జరగటం ఈ శిల్పకు అలవాటు లేదు.’

‘అంటే మనం త్వరలో భార్యాభర్తలు కాబోతున్నామన్న మాట.’ వ్యంగ్యంగా అడిగాడు.

‘మీ ఆశయం తప్పకుండా నెరవేరుతుంది.‘

క్రీగంట చూస్తూ భుజాలనిండా పైట కప్పుకుంది.

‘బైదిబై... మన పెళ్ళి ఎలా జరగాలనుకుంటున్నారు.’

‘అంటే...’

కారు తుంపాల గ్రామంలోకి ప్రవేశించింది.

‘అంటే... ఆకాశమంత పందిరి భూదేవంత....’

అర్ధోక్తిలో ఆగిపోయాడు ఆమె వడి చూపుల్ని చూడగానే.

‘ఇంతగొప్ప పెళ్ళికి అంత పబ్లిసిటీ అనవసరములేండి.’

‘ఆహా! అదికాదు......మీరు అసలే రాజానరేంద్రదేవ్ మనుమరాలు కదా. పురజనులంతా వేడుక చూసి తరించి పోతే బాగుంటుందని.’

‘అఖ్ఖర్లేదు..... సింపుల్ గా రిజిష్టర్డ్ మేరేజ్ అయితే బాగుంటుంది.’

‘పూలదండలు మార్చుకునే గాంధర్వ వివాహమైనా ఫర్వాలేదు.’

కారు లోగిలిలోకి ప్రవేశిస్తుండగా వారి మధ్యసంభాషణ ఆగిపోయింది.